క్లుప్తంగా

పిల్లలకు తల్లుల ఆశీర్వచనం


పంగిడిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను ఆశీర్వదిస్తున్న తల్లులు

ద్వారకాతిరుమల: చిన్న వయస్సు నుంచే పిల్లలు తల్లిదండ్రులను ఏవిధంగా గౌరవించాలి అనేది తల్లికి వందనం కార్యక్రమం తెలియజేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని పంగిడిగూడెం-2 అంగన్‌వాడీ కేంద్రానికి 3 నుంచి 6 ఏళ్ల వయస్సు గల పిల్లల తల్లులను శనివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలతో తల్లులకు పాదాభివందనం చేయించి, వారికి తల్లులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఈ సందర్భంగా మేరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు మంచి అలవాట్లు అలవరచుకోవడంతో పాటు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలనేది నేర్చుకుంటారన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుని, మంచి ఉద్యోగంలో స్థిరపడ్డ ఒక విద్యార్థి తల్లిని సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం శివారు కుమ్మరిగట్టు వద్ద ఉన్న విజయగణపతి ఆలయ సమీపంలో నిర్మిస్తున్న శ్రీ రమాసహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన నీరుకొండ వీర్రాజు, రత్నకుమారి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఇచ్చారు. శనివారం కొమ్ముగూడెంలో స్థలదాత ఆలపాటి దుర్గారావు చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండేపాటి రామకృష్ణ, పెనుగుర్తి సోంబాబుకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సుమారు రూ. కోటి వరకూ ఖర్చవుతుందని దాతలు సహకరించాలని కోరారు.

జెట్టి గురునాథరావు పరామర్శ


నాగచంద్రావతమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జెట్టి గురునాథరావు

కొయ్యలగూడెం: గవరవరం వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ సీమకుర్తి సత్యనారాయణ మాతృమూర్తి నాగచంద్రావతమ్మ ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని శనివారం మచిలీపట్నం వైఎస్సార్‌సీపీ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జెట్టి గురునాథరావు పరామర్శించారు. చంద్రావతమ్మ మృతిపై వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కసికుర్తి వేణు, గంటా రమేష్, బొమ్మ రామకృష్ణ, సంకుకొండ, జుంగ బాబ్జి, బొమ్మా కృష్ణ, కొనాల దివాకర్, వేముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు.. విజ్ఞాన వీచికలు


కొయ్యలగూడెం గ్రంథాలయంలో నీతి కథలను బోధిస్తున్న దృశ్యం


చదరంగం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


ఉత్సాహంగా యోగా నేర్చుకుంటున్న చిన్నారులు

కొయ్యలగూడెం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు గ్రంథాలయాల్లో కొనసాగే సమ్మర్ క్యాంపు శిబిరాల్లో నీతి కథలు, ధ్యానం, యోగ, చదరంగం వంటి వాటితో పాటు జాతీయ నాయకులు, స్వాతంత్రోద్యమకారుల జీవిత చరిత్రలు, పురాణ ఇతిహాసాల గురించి తెలియజేస్తున్నారు. అలాగే రెండు మూడు రోజులకు ఓమారు క్విజ్ పోటీలు, చదరంగం, స్కిప్పింగ్ తదితర పోటీలను నిర్వహిస్తూ బహుమతులను సైతం దాతల చేతుల మీదుగా అందజేస్తున్నారు. నైతిక విలువలు, బంధాలు అనుబంధాల గురించి అదేవిధంగా శారీరక, మనో వికాస మేధస్సుకు సంబంధించిన క్రీడలను ఆడిస్తూ వాటిపై విద్యార్థుల్లో మక్కువను కలిగిస్తున్నారు. సెలవు దినాలు మినహా ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు విద్యార్థులు స్వచ్ఛందంగా హాజరవుతున్నారు. చదువుల పోటీ ప్రపంచంలో అలసిన విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాల పట్ల ఆకర్షితులవుతూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

సమ్మర్ క్యాంప్ బాగుంది



మా తల్లిదండ్రులు గ్రంథాలయాల గురించి చెబుతూ ఉండేవారు. సమ్మర్ క్యాంపులకు రావడం ద్వారా గ్రంథాలయాల గురించి మాకు కూడా తెలిసింది. ఇక్కడ రోజూ పుస్తకాలు చదవించడంతోపాటు ఆటలు, పోటీలు నిర్వహిస్తున్నారు. సమ్మర్ క్యాంప్ చాలా బాగుంది.

– నిమ్మగడ్డ లక్ష్మి అనన్య, 8వ తరగతి విద్యార్థిని

ప్రేరణగా శిక్షణ తరగతులు



గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు మాకు ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ సమ్మర్ క్యాంపుల్లో తెలుసుకున్న విషయాలతో మాకు లైబ్రరీల పట్ల మరింత జిజ్ఞాస పెరిగింది. ఇక్కడ ఎన్నో పుస్తకాల ద్వారా చాలా విషయాలు నేర్చుకోవచ్చు. వేసవి సెలవులు అయిన తరువాత కూడా లైబ్రరీకి వచ్చేందుకు ప్రయత్నిస్తా.

– కొత్త హేమ, 9వ తరగతి విద్యార్థిని

పారిజాతగిరిలో పూజలు


శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం అర్చకులు, నల్లూరి రవి కుమార్ ఆచార్యులు, ఋషికేశ్ ఆచార్యులు, కుమారాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వేసవి సెలవులు, వివాహ ముహూర్తాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాద, మజ్జిగ వితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగ ప్రసాద్‌రావు, పేరిచర్ల జగపతిరాజు, దండు ధనరాజు, వాసవి సాయి నగేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


అనివేటి మండపంలో భక్తుల రద్దీ


ఆకట్టుకున్న కోలాట నృత్యాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు చిన వెంకన్న ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ అనివేటి మండపంలో వివాహాలు భారీగా జరిగాయి. అలాగే పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

వీర జవాన్ మురళీనాయక్‌కు జోహార్లు


బుట్టాయగూడెం: వీర జవాన్‌ల మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం


చింతలపూడి: జవాన్ మురళీధర్ నాయక్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: వీర జవాన్ మురళీనాయక్ మృతి యావత్ భారత దేశానికే దిగ్భ్రాంతిని కలిగించిందని బీజేపీ నాయకుడు కొండేపాటి రామకృష్ణ అన్నారు. శనివారం రాత్రి బుట్టాయగూడెంలో వివిధ పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో వీరజవాన్ మురళీనాయక్ మృతికి సంతాపం తెలుపుతూ స్థానిక నెహ్రూ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన వీరజవాన్ మురళీ నాయక్, సచిన్ యాదవ్‌రావు వనాంజే ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అదేవిధంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగపర్తి సోంబాబు, వంకా కాంచనమాల, మాటూరి ముసలయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెలగ మాధవరావు, పెనుగుర్తి సోంబాబు పాల్గొన్నారు.

చింతలపూడి: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా యుద్ధభూమిలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీధర్ నాయక్‌కు హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం స్థానిక సుబాస్ చంద్రబోస్ విగ్రహం వద్ద పట్టణ ప్రజలు మురళీధర్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ రక్షణ సమితి అధ్యక్షుడు చిల్లపల్లి మోహన్ రావు, సెక్రటరీ వరప్రసాద్ తంటేపూడి, గౌరవ అధ్యక్షుడు నిమ్మగడ్డ దుర్గారావు, చీదరాల మధుబాబు, బోడ బాలు, గాంధి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిటకిట


కొయ్యలగూడెం బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

కొయ్యలగూడెం: బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో సందడిగా మారాయి. వేసవి సెలవులతోపాటు వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. వివాహ వేడుకలకు కొన్ని ఆర్టీసీ బస్సులు కేటాయించడంతో బస్సుల కొరత ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం కొయ్యలగూడెం బస్టాండులో తీవ్ర రద్దీ నెలకొంది.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి


నామవరంలో మహిళకు కుట్టుమెషీన్ అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: మండలంలోని నామవరం గ్రామంలో శనివారం మహారాణా ప్రతాప్ జయంతిని బంజారా భజరంగీ బేరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు భూక్యా వేణుగోపాల్ మాట్లాడుతూ మొఘలాయి సామ్రాజ్యాన్ని ఎదిరించి పరాయి పాలనలో బానిసలుగా ఉండకుండా స్వతంత్రంగా జీవించాలని జీవితకాలం పోరాటం చేసిన మొట్టమొదటి భారత స్వాతంత్ర్య యోధుడు మహా రాణా ప్రతాప్ అని అన్నారు. రాణా జయంతిని ప్రభుత్వం ఆత్మగౌరవ పోరాటదినం జరపాలని కోరారు. అనంతరం పేద మహిళకు సంఘం తరుపున కుట్టు మెషీన్‌ను మిషన్‌ను అందించారు. సంఘ గ్రామ అధ్యక్షుడు మూడు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కుట్టు మెషీన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశంలో నిజమైన అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో భూక్యా రాములు నాయక్, ఇస్లావత్ ప్రేమ్ చంద్, ధరావతు రమేష్, మూడు పుష్పావతి, కేళోత్ అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండండి

- సీఐ సీహెచ్ రాజశేఖర్
- సుప్రింపేటలో పోలీసుల పల్లె నిద్ర


సుప్రింపేటలో పల్లె నిద్ర కార్యక్రమంలో గ్రామస్తులతో సీఐ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు

చింతలపూడి: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సుప్రింపేటలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై శుక్రవారం రాత్రి ఎస్సై కుటుంబరావు, సిబ్బందితో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పోలీసు శాఖ ప్రజలకు రక్షణ కల్పించడం కోసం పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించే దిశగా ప్రతి గ్రామంలోను పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. చట్టాలను గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. సైబర్ క్రైమ్ సంబంధిత ఘటనలు ఎదురైతే వెంటనే 1930కి సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 112 సేవను వినియోగించుకోవాలని కోరారు. ఏదైనా గోప్యమైన సమాచారం ఉంటే వాట్సాప్ నెంబర్ 95503 51100కు నేరుగా సమాచారం పంపించవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల నివారణ కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్సై కుటుంబరావు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి పథకాలకు విరాళాల వెల్లువ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన, గోసంరక్షణ పథకాలకు ముగ్గురు భక్తులు వేరువేరుగా శనివారం రూ.6,15,632 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పినకడిమికి చెందిన బి.మారయ్య నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షలు, విజయవాడకు చెందిన ఉన్నవ మారుతీ గోసంరక్షణ పథకానికి రూ.3,15,516, అదే పట్టణానికి చెందిన మామిడి కృష్ణమూర్తి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


నృత్య ప్రదర్శనలు జరిపిన బాలికలు


ఆలయ ఆవరణలో నాట్యం చేస్తున్న బాలికలు

ద్వారకాతిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరుగుతున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా మణికొండకు చెందిన నటరాజ నృత్య నికేతన్ బాలికలు ఆలయ ఆవరణలోనూ, అలాగే స్థానిక శ్రీహరి కళాతోరణ వేదికపై శనివారం రాత్రి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు నృత్య ప్రదర్శనలను వీక్షించారు.

సాయంపాలెంలో సంచార వైద్యసేవలు


వైద్యశిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: సాయంపాలెం గ్రామంలో బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం 104 సంచార వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఏఎం ఆంజనేయులు వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 116 మంది వైద్యసేవలు పొందారు. సుగరు, బీపీ, ఇతర వ్యాధులతో పాటు గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్రవ పదార్థాలకు ఎక్కువగా తీసుకోవాలని, మాంసాహారం తగ్గించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.ఏడుకొండలు, సూపర్‌వైజర్ సీహెచ్ ఎస్ కృష్ణవేణి, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు స్టాఫ్ నర్సు నిరీక్షణ ఎంపిక


అవార్డుకు ఎంపికైన మేడిది నిరీక్షణ కుమారి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రి స్టాఫ్ నర్సు మేడిది నిరీక్షణ కుమారి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నర్స్ అండ్ మిడ్ వైఫ్స్ కౌన్సిల్ (ఏపీఎన్ఎంసీ) రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ పర్యవేక్షణలో ఈ నెల 12న విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకోనున్నారు. జంగారెడ్డిగూడెం మొగళ్లపు నరసయ్య మెమోరియల్ ఏరియా ఆసుపత్రి స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తూ, విధి నిర్వహణలో నిబద్ధత, వృత్తి నైపుణ్యం చూపించినందుకు గాను నర్సింగ్ సర్వీస్ (స్టాఫ్ నర్స్) విభాగంలో మేడిది నిరీక్షణ కుమారి అవార్డును అందుకోనున్నారు. కాగా ఆమె ఇప్పటివరకు 11 పురస్కారాలు, ఒక రాష్ట్ర అవార్డును అందుకోవడం విశేషం. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ బేబీ కమల, ఆర్ఎం వి.రాంబాబు, వైద్యులు, సహ ఉద్యోగులు నిరీక్షణను అభినందించారు.